"అసలు నన్ను పోలీసుల దగ్గరికి తీస్కెళితే నీకొచ్చే లాభంఏంటి? నేనేమీ నేరాలు చెయ్యలేదు. వాళ్ళు నన్నుచూసి ఇలాంటి అమాయకుడిని ఎందుకు తీసుకొచ్చావ్ అంటూ నిన్నేతిడ్తారు. నీకు శ్రమ, టైంవేస్ట్‌కాకుండా పోలీసులచేత చివాట్లు కూడా తినాల్సి వస్తుంది.... అందుకే నన్ను వదిలెయ్"

"నాకేం లభమా?.... ఒకటా రెండా .... పదివేలు లాభం!!" అన్నాడు పుల్లయ్య.

"పదివేలా?.... అదేలా?"

"నువ్వే చూడు...." అంటూ ఇందాక టీస్టాల్‌లో తను తీసుకున్న న్యూస్‌పేపరు రాంబాబుకి ఇచ్చాడు.

ఆ పేపరులోని వార్త చదవగానే రాంబాబు, కిష్టయ్య అదిరిపడ్డారు.

అందులో రాంబాబు ఫోటో క్రింద ఆ వార్త ప్రముఖంగా ప్రచురింపబడి ఉంది.

రాంబాబు ఇల్లు సోదాచేస్తే అతని ఇంట్లో స్మగ్లింగ్‌కి సంబంధించిన పత్రాలు దొరికాయని, కొన్ని బంగారు బిస్కట్లు దొరికాయనీ, అతను పేరుమోసిన స్మగ్లరనీ, ఎన్నో హత్యలతో సంబంధం ఉందనీ ఎంతో కాలంగా పోలీసుల కళ్ళు కప్పి తప్పించుకుంటున్నాడనీ అతన్ని పట్టి ఇచ్చినవారికి గానీ ఆచూకీ తెలిపినవారికిగానీ పదివేలరూపాయలు బహుమతిగా ఇవ్వబడుతుందని ఆ వార్త సారాంశం.

"నన్ను పట్టిఇచ్చినవారికి పదివేల రూపాయల బహుమానమా ....?" ఆశ్చర్యంగా కిష్టయ్యవంక చూశాడు రాంబాబు.

కిష్టయ్య రాంబాబువంక జాలిగా చూశాడు.

"అసలు మన ఇల్లు పోలీసులు మళ్ళీ ఎప్పుడు సోదాచేశారు?....చేసినా వాళ్లకి వజ్రాలు, బంగారు బిస్కెట్లు స్మగ్లింగ్ కాగితాలూ ఎందుకు దొరికాయ్.... ఎలా దొరికాయ్?"

"ఏమోనండి గురూగారూ...నిన్నంతా నేను మీదగ్గరే ఉన్నానుకదా .... అప్పుడు పోలీసులు సోదా చేసినట్లున్నారు. మీమీద స్మగ్లింగ్ నేరం మోపడానికి ఎవరో ఈ కుట్ర పన్నారు. గురూగారూ...." ఆందోళనగా అన్నాడు కిష్టయ్య.

'ఇప్పుడేం చెయ్యాలి" బెంబేలు పడ్డాడు.

"హాహాహా.... " భయంకరంగా నవ్వాడు డ్రైవరు.

"అబ్బె ఉండవయ్యా నీ గోల.... అసలే ఏం చెయ్యాలో యేం తోచక చస్తుంటే ఏంటానవ్వు?" అంటూ డ్రైవర్ మీద విసుక్కున్నాడు కిష్టయ్య.

"చూడు పుల్లయ్యా...నిజంగా నాకేం తెలీదు.... నేనేం నేరం చెయ్యలేదు...నామాట నమ్ము....లారీ ఆవు దిగిపోతాం" రాంబాబు డ్రైవర్ని ప్రాధేయపడ్డాడు.

"అమ్మా...నిన్నొదిలేస్తే నాకు పదివేలు నష్టం కాదూ?.... ఆ పది వేలూ నాకు ఇస్తే నిన్ను వదిలేస్తా...."

పుల్లయ్య ఇంకా ఎట్టి పరిస్థితుల్లో తమని వదలడని రాంబాబూ, కిష్టయ్యలకు అర్థం

అయ్యింది. వాడి బారినుండి ఎలా తప్పించుకోవాలా అని ఆలోచన తట్టింది. మెల్లగా రాంబాబు చెవిలో తన ప్లాన్ గురించి చెప్పాడు. రాంబాబు సరేన్నట్లు తలూపాడు.

"సరేగానీ పుల్లయ్యా...నువ్వెంత కాలంనుండీ లారీ తోల్తున్నావు?"
అని అడిగాడు కిష్టయ్య.

"అబ్బో.... చాలా సంవత్సరాలనుండి తోల్తున్నాను....దాదాపు పదిసంవత్సరాలనుండీ...."

"మరేంటి కొత్తగా నేర్చుకున్నవాడిలా నడుపుతున్నావ్?...."

"అంటే?" అర్థంకానట్టు కిష్టయ్య వంక చూశాడు పుల్లయ్య.

"చాలా స్లోగా నడుపుతున్నావే?...." పుల్లయ్యని కవ్వించాడు కిష్టయ్య.

"అయితే చూస్కో నా తడాఖా" అంటూ యాక్సిలరేటర్‌మీద కాలు గట్టిగా నొక్కాడు.

అంతే.....లారీ రివ్వున ముందుకు దూసుకపోసాగింది.

కిష్టయ్య రాంబాబుకి కనుసైగ చేశాడు. డోర్ దగ్గరగా ఉన్న రాంబాబు మెల్లగా శబ్దంకాకుండా డోర్ తెరిచి డోర్‌ని దగ్గరగా లాగి రెడీగా పట్టుకుని కూర్చున్నాడు.

"స్పీడ్ చాలా ఇంకా పెంచాలా?" కిష్టయ్యని అడిగాడు పుల్లయ్య.

"ఇంకా పెంచుచూద్దాం...." అన్నాడు కిష్టయ్య.

లారీ స్పీడు మరింతగా పెరిగింది.

కిష్టయ్య రాంబాబువంక చూస్తూ రెడీగా ఉన్నావా అన్నట్టు కళ్ళతో సైగచేశాడు. రాంబాబు తల ఊపాడు.

కిష్టయ్య హఠాత్తుగా బ్రేక్‌మీద కాలేసి తన బలమంతా ఉపయోగించి నొక్కడు.

లారీ క్రి.....చ్‌చ్ .... అంటూ పెద్ద కుదుపుతో ఆగింది.

లారీ హఠాత్తుగా ఆగడంవల్ల ఆ సంఘటన ఊహించని డ్రైవర్ తూలి లారీస్టీరింగ్‌మీద పడ్డాడు. స్టీరింగ్‌కి అతని ముఖం గుద్దుకుని ముక్కు పచ్చడైంది. ఆ దెబ్బకి పుల్లయ్య కళ్ళు బైర్లు కమ్మాయి. ముక్కులోంచి రక్తం కూడా కాస్త కారింది.

ఆ షాక్ నుండి తేరుకోడానికి అతనికి కొన్ని క్షణాలు పట్టింది.

ముక్కు రుద్దుకుంటూ "మిమ్మల్నేం చేస్తానో చూడండి....." అంటూ పక్కకి తిరిగి చూశాడు. కానీ వాళ్ళిద్దరూ అక్కడ లేరు. క్యాబిన్ డోర్ తెరిచి ఉంది.

పుల్లయ్య కంగారుగా లారీ దిగాడు. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. కనుచూపు మేరలో వాళ్ళు ఎక్కడా కనిపించలేదు. ఇంతలోనే ఎక్కడికి మాయమయ్యారు?!!

రోడ్డుప్రక్క ఉన్న గుబురు పొదల్లో అంతా వెతికాడు. ఎక్కడా వాళ్ల జాడ కనిపించలేదు. పుల్లయ్య ఆశ్చర్యానికి అంతులేదు. అంతలోనే వాళ్ళు ఎలా మాయమైపోయారో అర్థం కాలేదు.

నిరాశగా లారీ ఎక్కి స్టార్ట్ చేశాడు.

"ప్చ్.... చేతికి అందినట్టే అంది పదివేలూ పోయాయ్" నిట్టూర్చాడు.

లారీ భారంగా కదిలింది.

రాంబాబు, కిష్టయ్య ఎక్కడికీ పోలేదు. వాళ్ళు లారీ వెనక్కి వెళ్ళి అక్కడినుంచి లారీలోకి ఎక్కి అక్కడ లారీలో ఉన్న అట్టపెట్టెలమీద కనబడకుండా బోర్లా పడుకున్నారు. పావుగంట తరువాత లారీ ఊళ్ళోకి వచ్చింది ఒకచోట ట్రాఫిక్ అడ్డొచ్చి లారీ స్లో అయినప్పుడు ఇద్దరూ లారీ లోంచి కిందికి దూకేశారు.

## ప్రైవేట్ డిటెక్టివ్ సహాయం

ఆ రోజు సాయంత్రం శ్యామ్రావు ఇంట్లో పేపర్లోని న్యూస్ గురించి చాలా చర్చ జరిగింది.

రాంబాబు ఫోటోతో సహా పేపర్లో పడింది. ప్రజల దృష్టిలో పోలీసుల దృష్టిలో రాంబాబు ఒక స్మగ్లర్, హంతకుడు!

రాంబాబు తను నిర్దోషినని నిరూపించుకునే ప్రయత్నం స్వంతంగా ఇంక చేసుకోలేడని నిర్ణయానికి వచ్చారు శ్యామ్రావు, కిష్టయ్యా.

"మరి నేనేం చెయ్యాలి?....." రాంబాబు దీనంగా అడిగాడు.

"చార్మినార్ చౌరస్తాలో ఒక డిటెక్టివ్ ఏజెన్సీ ఉంది....దాని పేరు 'ది బెస్ట్ ఇన్వెస్టిగేటర్స్ "
మనం ఆ ప్రైవేట్ డిటెక్టివ్‌ల సహాయం తీసుకోవడం మంచిది....వాళ్ళు
మనకోసం కేసు ఇన్వెస్టిగేట్ చేస్తారు...." అన్నాడు శ్యామ్రావు.

అతని సలహా రాంబాబుకి, కిష్టయ్యకి నచ్చింది. కాస్త చీకటి పడిన తరువాత ఇద్దరూ ఆటోలో చార్మినార్ చౌరస్తాలోని దిబెస్ట్ ఇన్వెస్టిగేటర్స్" డిటెక్టివ్ ఏజెన్సీకి వెళ్ళారు.

వీధి తలుపు వేసుంటే కాలింగ్‌బెల్ నొక్కారు.

కొన్ని క్షణాల తరువాత ఒక వయసుమళ్ళిన వ్యక్తి తలుపు తీశాడు.

"రండి.... రండి....." అంటూ పక్కకి తొలిగాడు.

రాంబాబు కిష్టయ్య అతనివంక చూశారు. పంచె కట్టుకుని ఉన్నాడు. చొక్కాకి మాసికలు వేసి ఉన్నాయ్. బహుశా పనివాడేమో అనుకున్నారు వాళ్ళు.

"ఎవరైనా డిటెక్టివ్ ఉన్నారా?" అంటూ అడిగాడు రాంబాబు అతన్ని.

"రండి లోపలికి రండి...." అంటూ ఇద్దరినీ లోపలి గదిలోకి తీసుకెళ్ళి టేబులుముందున్న కుర్చీలు చూపించాడు.

"కూర్చోండి"

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు. ఆ ముసలతను వాళ్ళిద్దరికీ ఎదురుగా ఉన్న రివాల్వింగ్ ఛైర్‌లో కూర్చుని

"ఎస్ ప్లీజ్....వాటీజ్ యువర్ ప్రాబ్లెమ్?" అని అడిగాడు తను తెల్లని తలవెంట్రుకల్ని చేత్తో సర్దుకుంటూ.

రాంబాబూ కిష్టయ్య ముఖాముఖాలు చూస్కున్నారు.

"నువ్వా .... అయ్‌మీన్ .....మీరూ?!" అన్నాడు రాంబాబు సందేహిస్తూ.

అతను చిరునవ్వు నవ్వుతూ తలమీది తెల్ల వెంట్రుకల విగ్గుని తీసేశాడు. కళ్ళకింద

చెంపలమీద మడతల మాదిరి దిద్దుకున్న గీతల్ని తుడిపేసుకున్నాడు.

"నేనే డిటెక్టివ్ సింహ్‌స్వప్న్‌ని...."

"మీరు ఆఫీసులో కూడా మారు వేషాల్తో ఉంటారా సార్?" ఆశ్చర్యంగా అడిగాడు కిష్టయ్య.

"ఉహు..... ఇప్పుడే ఒక కేసు విషయంలో పరిశోధించడానికి బయటికి వెళ్ళాను. నా మారువేషం తీసేసేలోగా మీరొచ్చారు.... ఊ.... మీరెవరో ఏం పనిమీద వచ్చారో చెప్పండి...." అన్నాడు సింహాస్వప్న్.

రాంబాబు జరిగిన కథంతా చెప్పాడు.

"కాబట్టి అసలు హతకుడెవరో మీరు తెలుసుకుని నన్ను ఈ ఊబిలోంచి బయటికి లాగాలి. మా అనుమానం జగ్గూ, వీరూల మీద ఉంది. కానీ వాళ్ళెక్కడ ఉంటారో మాకు తెలీదు, వాళ్లే ఈ హత్య చేశారొ వేరే ఎవరైనా చేశారో కనుక్కొని మీరు అసలు హంతకుడిని పట్టుకోవాలి!" అన్నాడు రాంబాబు.

"అలాగే...."

"మీ ఫీజు?...."

"అయిదువేలు!"

"అమ్మో.... అయిదువేలే!!...."

"చాలా తక్కువ ఆ ఎమౌంట్ .... ఉరికంబం ఎక్కబోయేవాళ్లని రక్షిస్తే యాభైవేలైన ఈజీగా ఇస్తారు.... మీరు ఎక్కువ డబ్బు ఎలాగూ ఇచ్చుకోలేరని అనిపించి చాలా తక్కువ అడిగాను."

"సరే..... రేపు మా కిష్టయ్య చేత మీకు అడ్వాన్స్‌గా ఒక రెండువేలు పంపిస్తాను...."

"గమ్మత్తు చూడండి.....మా గురూగారేమో ఇంతఅమాయకులా..... ఆయన్ని పట్టిస్తే పదివేల బహుమానం ప్రకటించారు పోలీసువాళ్ళు" అన్నాడు కిష్టయ్య నవ్వుతూ.

"పదివేలా .... బహుమానమా??...." ఆశ్చర్యంగా చూశాడు సింహస్వప్న్.

"మీరు నమ్మడంలేదుకదూ? కావలిస్తే చూడండి" అంటూ జేబులోంచి పేపర్ కటింగు తీసి చూపించాడు.

సింహస్వప్న్ ఆ కటింగు చదివి నిమిషంపాటు ఆలోచించాడు.

"ఒక్క నిమిషం.... ఇప్పుడే వస్తాను...." అంటూ లేచాడు సింహస్వప్న్.

"మేమిక వెళ్తామండీ...." అన్నాడు రాంబాబు.

"ఒక్క నిమిషం కూర్చోండి...." అంటూ గది బయటికి వెళ్ళి గదితలుపులు మూసి బయ అటునుండి గడిపెట్టేశాడు.

"అదేంటి?.... గదిలో పెట్టి గడియ పెట్టారెందుకూ అంటూ ఆశ్చర్యంగా అడిగాడు కిష్టయ్యవంక చూసి రాంబాబు.

"ఇందులో ఏదో గోల్‌మాల్ ఉందండీ గురూగారు...." అన్నాడు కిష్టయ్య.

గది బయటినుండి డిటెక్టివ్ సింహస్వప్న్ పకపకనవ్వాడు.

"ఏమండీ.... మమ్మల్ని గదిలోపెట్టి తలుపెందుకు గడిపెట్టారు?" అంటూ అరిచాడు రాంబాబు.

"నువ్వు చెప్పిన కేసు వింటే నిన్ను రక్షించడం చాలా కష్టమని తెలుస్తూనే ఉంది. తీరా అంతకష్టపడి రక్షించినా నాకు దక్కేది కేవలం అయిదువేలే...."

'అయితే?...." రాంబాబుకి చెమటలు పడ్తుండగా అడిగాడు.

"ఇప్పుడు పోలీసులకి ఓ ఫోన్ కొడ్తే ఏమాత్రం శ్రమలేకుండా నాకు పదివేలు వస్తాయ్...."

పకపక నవ్వుకున్నాడు సింహస్వప్న్.

## *ఫ్రేమ్ - 27*

### *రెడీ-వన్, టూ, థ్రీ*

రాంబాబు కిష్టయ్యల మొహాలు పాలిపోయాయి.

సింహస్వప్న్ పోలీసులకి ఫోన్ చెయ్యడానికి డ్రాయింగు రూమ్‌లోకి వెళ్ళాడు.

"అయిపోయింది.... అంతా అయిపోయింది....నేనిక ఉరికంబం ఎక్కడం ఖాయం! ...." దిగులుగా అన్నాడు రాంబాబు.

"అలా బెంబేలు పడితే ఎలా గురూగారు...నన్ను చూడండి.... నేను ధైర్యంగా లేనూ?...." అన్నాడు కిష్టయ్య.

"అవునుమరి....ఉరికంబం ఎక్కేది నువ్వుకాదుగా...."

"పోలీసులు వచ్చేలోగా మనం ఇక్కడినుండి తప్పించుకునే ఉపాయం ఏదైనా ఆలోచించాలి గురూగారూ...." అన్నాడు సీలింగువైపు చూస్తూ కిష్టయ్య.

అక్కడ డ్రాయింగు రూమ్‌లో....

సింహస్వప్న్ నెంబరు దడయల్ చేశాడు.

అవతలవైపు రింగు అవుతున్న శబ్దం వినిపించింది సింహస్వప్న్‌కి.

కొన్ని క్షణాల తరువాట రిసీవర్ ఎత్తారు ఎవరో.

"హలో...." అంది అవతలి కంఠం.

"అవును .... నేను ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్‌ని మాట్లాడుతున్నాను."

"హలో ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్...నేను సింహస్వప్న్‌ని!"

"ఓ సింహస్వప్న్!.... ఏంటి విశేషాలు?"

"ప్రముఖ స్మగ్లర్, హంతకుడు రాంబాబు నాదగ్గరికి వచ్చాడు.... సహాయం కోరి"

"ఓ..... అయితే రాంబాబుకి మీరు సహాయం చేయదల్చుకున్నారన్న మాట.... అతన్ని నిర్దోషిగా మీరు నిరూపించలేరు.... మరోసారి మనకి సవాల్..... అయినా పోలీసులకి, ప్రయివేట్ డిటెక్టివ్‌లకీ మధ్య ఇలాంటి సవాళ్ళు ఎప్పుడూ ఉండేదేగా! .... బీరెడీ...."

“నేను రెడీగా లేను” సింహస్వప్న్ నవ్వాడు.

“అదేం?” ఆశ్చర్యంగా అడిగాడు శ్రీరామ్.

“రాంబాబు నిర్దోషని నేను నిరూపించ దలచుకోలేదు.”

శ్రీరామ్ పకపకా నవ్వాడు.

“ఎందుకంటే రాంబాబుని నిర్దోషిగా నిరూపించే ఆధారాలు ఏవీ ఉండవు గనక ..... రాంబాబే అసలు దోషి గనుక..... అంతేకాదు అంతర్జాతీయ స్మగ్లింగ్ గ్యాంగ్‌కి నాయకుడైన రాంబాబుకి మద్దతు ఇస్తే, లేదా అతను తప్పించుకోడానికి అవకాశంకల్పిసతే తనమీద చట్టపరంగా తీవ్రమైన చర్య తీసుకోవాల్సి ఉంటుంది....”

“మీకా శ్రమేం అక్కరలేదు.... రాంబాబుని మా ఆఫీసులో బంధించాను.... అతన్ని మీకు అప్పజెప్తాను.... మరి మీరు ప్రకటించిన పదివేల రూపాయల బహుమతి నాకు ఇస్తారు కదూ?....”

“మీ బహుమతి ఎక్కడికీ పోదు.... అతన్ని అలాగే బంధించి ఉంచండి..... నేను అయిదు నిముషాల్లో వచ్చేస్తాను.... పొరబాట్న కూడా అతన్ని షూట్ చెయ్యకండి.... నాకతను ప్రాణాలతో కావాలి!”

“ఓకే.... అలాగే....”

ఫోన్ డిస్కనెక్ట్ చేసి సింహస్వప్న్ పకపకా నవ్వాడు.

ఇంతలో ....

రాంబాబుని బంధించిన గదిలోంచి గోడుగోడున కిష్టయ్య ఏడవడం వినిపించింది.

సింహస్వప్న్ కంగారుగా ఆ గదివేపు పరుగెత్తాడు. గది కిటికీలోకంచి లోపలికి చూస్తూ అరిచాడు.

“ఏమిటి..... ఏమైంది?”

“ఇంకేమైనా కావాల్రో నాయనోయ్ ....మీరు పోలీసులకి పట్టిస్తానని అనగానే తనకి ఉరిశిక్ష పడుతుందని తలుచుకోగానే గురూగారి గుండాగి చచ్చిపోయారు.... వాయ్యోవ్....మా గురూగార్ని మీరే చాంపేశారు.... మీకూ ఉరిశిక్ష పడుతుంది.... ఇది హత్యే బాబోయ్....” రాంబాబు మీదపడి ఏడవసాగాడు కిష్టయ్య.

సింహస్వప్న్ కంగారుగా గది తలుపు గడియతీసి లోపలికి వెళ్లాడు.

రాంబాబు వెల్లకితలా కాళ్ళు బార్లా చాపుకుని నేలమీద పడుకుని వున్నాడు.

“హత్యలుచేసి స్మగ్లింగ్ చేసేవాడికి ఇంత వీక్ గుండె వుంటే ఎలాగయ్యా.... అయినా నిజంగానే చచ్చిపోయాడా?” కంగారుగా అడిగాడు సింహస్వప్న్.

“నిజంగా కాకపోతే అబద్దంగా చచ్చిపోతారా ఎవరైనా?....”

సింహస్వప్న్ జుట్టు పీక్కున్నాడు.

“అసలు రాంబాబుని పట్టిస్తే పదివేల రూపాయల బహుమతి ఇస్తానన్నారు.... మరి రాంబాబు శవాన్ని అప్పజెప్పినా డబ్బు ఇస్తారా?....” అడిగాడు కిష్టయ్యని.